## క్లుప్తంగా

### స్ప్రింక్లర్లతో రైతులకు మేలు



రైతులకు స్ప్రింక్లర్లు అందజేస్తున్న రమేశ్‌గౌడ్

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వం సబ్సిడీపై అందించే స్ప్రింక్లర్లతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పీఏసీఎస్ చైర్మన్ రమేశ్‌గౌడ్ అన్నారు. నంగునూరులో 37 మంది రైతులకు మంజూరైన స్ప్రింక్లర్ సెట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తూ పెద్దఎత్తున స్ప్రింక్లర్లు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, రహీంపాషా, జయపాల్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, గణేశ్, కనకయ్య, కిష్టయ్య, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వర్క్‌సైట్ పాఠశాలలకు సామగ్రి పంపిణీ



స్టేషనరీ పంపిణీ చేస్తున్న భాస్కర్ శ్రీరాజ్

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణం, పట్టణ శివారులో గల గ్రామాల్లోని వర్క్‌సైట్ పాఠశాలలకు గురువారం 9 రకాల వస్తువులను జిల్లా సెక్టోరియల్ అధికారి–2 భాస్కర్ శ్రీరాజ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ శ్రీరాజ్ మాట్లాడుతూ.. స్థానిక ఇటుక బట్టీల వద్ద వలస వచ్చిన ఒరిస్సా రాష్ట్ర కార్మికుల బడీడు పిల్లలకు (6 నుంచి 14 సంవత్సరాలు) చదువు చెప్పించేలా ఇటుక బట్టీల వద్దనే ఈ సంవత్సరం ప్రభుత్వం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. సిద్దిపేట జిల్లా విద్యాశాఖ నుంచి మంజూరైన స్టేషనరీ, నోట్ బుక్స్, వర్క్‌బుక్స్, బ్లాక్ బోర్డులను 61 మంది విద్యార్థినీ, విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ దేశిరెడ్డి, సీఆర్పీ స్వామి, ఎంఐఎస్ రాజశేఖర్‌లు ఉన్నారు.

### టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని, నూతన బోర్డు ఆధ్వర్యంలోనే పోటీ పరీక్షలు నిర్వహించాలని ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ బీరకాయల వివేక్‌వర్ధన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివేక్‌వర్ధన్ మాట్లాడుతూ.. 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో టీఎస్‌పీఎస్సీ ఆటలాడుకుందని, పేపర్ లీకేజీలతో అనేక మంది నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ, బోర్డు సభ్యులను అరెస్ట్ చేసి, విచారణ చేయాలన్నారు. ఈ పేపర్ లీకేజీ ఘటనపై సిట్‌తో కాకుండా సిట్టింగ్ జడ్జితో పూర్తిస్థాయిలో విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నిరుద్యోగులకు భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శంకర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సంజయ్, నగర కార్యవర్గ సభ్యుడు హరీశ్, ఫణిందర్, తదితరులు పాల్గొన్నారు.

### చాడ వెంకట్‌రెడ్డిని విమర్శించడం సరికాదు

హుస్నాబాద్: సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ పార్టీని విమర్శించే హక్కు బీజేపీ నియోజకవర్గ నాయకుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తికి లేదని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిపె మల్లేశ్ అన్నాడు. పట్టణంలోని సీపీఐ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. బొమ్మ శ్రీరాంచక్రవర్తి నిన్నటివరకు కాంగ్రెస్‌లో ఉండి ఎమ్మెల్యే టికెట్ రాదని పదవుల కోసం పార్టీలు మారిన నీవు మాకు నీతులు చెప్పొద్దన్నారు. ఢిల్లీలో వందలాది మంది రైతుల చావులకు కారణమైంది బీజేపీ కాదా అని ప్రశ్నించాడు. ప్రజల కోసం పని చేస్తున్న చాడ వెంకట్‌రెడ్డిని విమర్శించే స్థాయి శ్రీరాంచక్రవర్తికి లేదన్నారు. భవిష్యత్‌లో సీపీఐ నాయకులను అనవసరంగా విమర్శలు చేస్తే ఊరుకునేది లేదన్నాడు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వనేశ్, నాయకులు అయిలేని సంజీవరెడ్డి, రాజ్‌కుమార్, బాలయ్య, రాజయ్య ఉన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

మిరుదొడ్డి(దుబ్బాక): ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి డ్రైవర్ అవగాహన కలిగి ఉండాలని భూంపల్లి ఎస్‌ఐ గంగరాజు కోరారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని ఆటో డ్రైవర్లకు భూంపల్లిలో గురువారం ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తమ వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ వంటి ధ్రువపత్రాలతో పాటు యూనిఫాం తప్పకుండా కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు సుమారు 40మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా ఎంఆర్‌సీ భవనం

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- వినియోగంలోకి తీసుకురావాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అక్కన్నపేటలో నిరుపయోగంగా ఎంఆర్‌సీ భవనం

అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం కొత్త మండలాలను ఏర్పాటు చేసి, లక్షల రూపాయలు వెచ్చించి ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తోంది. కానీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. భవనాలను వినియోగంలోకి తీసుకురావడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

మండల కేంద్రంలో 2017లో ఎంఆర్‌సీ భవన నిర్మాణానికి సుమారు రూ.24లక్షల నిధులు మంజూరయ్యాయి. ఏడాది కింద నిర్మాణం పూర్తి కావడంతో ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, ఎమ్మెల్సీ కూరపాటి రఘోత్తంరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కానీ ఆ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

**అద్దె భవనంలో ప్రభుత్వ కార్యాలయాలు..**

ఎంఆర్‌సీ భవనానికి దాదాపు ఐదారు అడుగుల దూరంలోనే తహసీల్దార్ కార్యాలయం ఉంటుంది. తహసీల్దార్ కార్యాలయాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. మరోపక్క నిరుపయోగంగా భూత్ బంగ్లాను తలపిస్తున్న ఎంఆర్‌సీ భవనాన్ని చూసి వాళ్లంతా పలు రకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇరుకు గదుల్లో నెట్టుకొస్తున్న తహసీల్దార్ కార్యాలయాన్ని లేక ఇతర ప్రభుత్వ కార్యాలయాలను అందులో ఏర్పాటు చేస్తే బాగుంటుందని అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. కానీ ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ ఆలోచనలు చేయకపోవడం దురదృష్టకరమని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎంఆర్‌సీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విద్యావంతులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

# మల్లన్నసాగర్ కాల్వ పనుల అడ్డగింత



కాల్వ పనులు అడ్డుకుంటున్న రైతులు

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్నసాగర్ కాల్వ పనులను తుక్కాపూర్ రైతులు గురువారం అడ్డుకున్నారు. మిడ్‌మానేరు నుంచి ఓపెన్ కెనాల్ ద్వారా ఒక టీఎంసీ నీటిని తరలించేందుకు తుక్కాపూర్ రైతుల నుంచి ప్రభుత్వం సాగుభూమి సేకరించిన విషయం తెలిసిందే. కాగా భూమి అప్పగించిన సమయంలో కుటుంబానికి 250 గజాల ఇంటి స్థలం, డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. తాము ఆందోళనకు దిగిన ప్రతిసారి సమస్య పరిష్కరిస్తామంటూ అధికారులు హామీనిస్తున్నారని, ఏళ్లు గడుస్తున్నా సమస్య మాత్రం పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పనులు అడ్డుకున్నారనే సమాచారం అందుకున్న డీఈఈ సాయిబాబా అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. తుక్కాపూర్ రైతుల డిమాండ్లను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ నివ్వడంతో వారు ఆందోళన విరమించారు.

# ఇళ్ల స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ గ్రామంలో గతంలో 86 మంది పేదలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలకు హద్దులు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అయినాపూర్ శివారులోని సర్వే నంబర్ 213/ఏలో గతంలో పట్టాలు పొంది పేదలు వేసిన గుడిసెలను సీపీఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయినాపూర్, రసులాబాద్ గ్రామాలకు చెందిన 86 మందికి పట్టాలిచ్చిన ప్రభుత్వం, అందులో అధికారులు హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో దానిని ఆసరాగా తీసుకొని గత పట్టాదారు దొంగ పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు బండకింది అరుణ్‌కుమార్, అయినాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, నాయకులు విజయ, మాజీ సర్పంచ్ వేములవాడ ప్రమీల, సుమలత, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్నిమాపక పరికరాలపై అవగాహన కల్పిస్తున్న సుల్తాన్ రాజ్‌కుమార్

సిద్దిపేటకమాన్: వేసవి నేపథ్యంలో అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట అగ్నిమాపక కేంద్ర అధికారి సుల్తాన్ రాజ్‌కుమార్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. సిద్దిపేట ఫైర్ స్టేషన్ ఆవరణలో గురువారం అధికారులు అగ్నిమాపక పరికరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుల్తాన్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. పట్టణంలోని జనసమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, మార్కెట్ ప్రాంతాలు, ఆస్పత్రుల్లో, షాపింగ్ మాల్స్, పెట్రోల్ బంకుల వద్ద అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. వేసవిలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకునే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎల్లప్పుడూ అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, వాటిని తరుచుగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. బహుళ అంతస్తుల ప్రదేశాల్లో సిబ్బంది, ఉద్యోగులు తప్పనిసరిగా అగ్నిపమాక సాధనాలను ఎలా ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ నరేశ్, ఫైర్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

దుబ్బాక: రైతులు ఆరుగాలం పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఏపీఎం దుర్గప్రసాద్ అన్నారు. గురువారం ఐకేపీ వడ్ల కొనుగోలుదారుల ఇన్‌చార్జ్‌లకు, నిర్వాహకులకు రబీ సీజన్ కొనుగోళ్లపై రాయపోల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం రాజయ్య మాట్లాడుతూ.. కొనుగోలు సెంటర్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే టోకెన్ తీసుకొని తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టాక తేమ శాతాన్ని పరిశీలించి జల్లి పట్టాకే తూకం వేయాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి ఐకేపీ సెంటర్లకు మంచి పేరును తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మున్నయ్య, సీఆర్పీ విజయ, ఐకేసీ సీసీలు, తదితరులున్నారు.

### కాల్వ మట్టి తరలింపు నిలిపివేయాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి, వీరాపూర్ గ్రామాల శివారులోని కాల్వ మట్టి అక్రమ రవాణాను నిలిపివేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి గురువారం బెజ్జంకి తహసీల్దార్ విజయప్రకాశ్‌రావుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పనులకు కాకుండా ఇతర అవసరాల కోసం టిప్పర్‌ల ద్వారా మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, డీవీరావు, నాగరాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీని ఆదరించాలి



దివ్యాంగుడికి బస్‌పాస్ అందజేస్తున్న డీఎం

నంగునూరు(సిద్దిపేట): ప్రజల సౌకర్యార్థం రోడ్డు రవాణా సంస్థ అనేక సేవలను ప్రారంభించిందని సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నంగునూరులో ప్రత్యేక క్యాంప్ నిర్వహించి దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. టీఎస్ ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా సంస్థ ఆధ్వర్యంలో కార్గో సేవలు అందుబాటులోకి తేవడంతో పాటు 12 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచిత, దివ్యాంగులు, విద్యార్థులకు రాయితీపై బస్‌పాసులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రమేశ్‌గౌడ్, జయపాల్ రెడ్డి, మహేందర్‌గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



ప్రశాంత్‌నగర్: శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్



చేర్యాల(సిద్దిపేట): జిల్లా వైద్యాధికారిని సన్మానిస్తున్న గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గులో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని గురువారం జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరానికి పరీక్షల నిమిత్తం వస్తున్న వారి సంఖ్య, వారికి అందుతున్న వైద్యం తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం శిబిరాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆరోగ్య కేంద్రానికి భవనం నిర్మించాలని గ్రామస్తులు జిల్లా వైద్యాధికారిని కోరారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. ఆయన వెంట వైద్యాధికారి, ఏఎన్‌ఎం, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 19వ వార్డులో గల అరుంధతి కల్యాణ మండపంలో నిర్వహించనున్న కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గ్యాదరి రవి పాల్గొన్నారు.

# సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



హుస్నాబాద్: పోలీసులకు శిక్షణ ఇస్తున్న వైద్యులు



గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి

హుస్నాబాద్: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డివిజన్‌లోని పోలీస్ సిబ్బందికి స్థానిక తిరుమల గార్డెన్‌లో గురువారం వైద్యులు సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండెపోటుకు, కార్డియాక్ అరెస్ట్‌కు మధ్య తేడాలు, లక్షణాలను వైద్యులు చక్కగా వివరించారు. సీపీఆర్ ఎలా చేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి మాట్లాడుతూ.. గుండెపోటుకు గురయ్యే వ్యక్తులకు సీపీఆర్ చేస్తే 50 శాతం బతికించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సౌమ్య, సీఐలు కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై తోట మహేశ్, పోలీస్ సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: గుండెనొప్పి వచ్చిన సమయంలో సీపీఆర్ చేయడంతో సదరు వ్యక్తి కోలుకునేందుకు కొంత అవకాశముంటుందని, సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ దాసరి అమరావతి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో మచ్చేందర్, ఎంపీవో దయాకర్ పాల్గొన్నారు.

**ప్రమాద సమయంలో ప్రథమ చికిత్స ముఖ్యం**

ప్రమాదం జరిగిన వెంటనే అందించే ప్రథమ చికిత్సతో మనిషి ప్రాణాలను కాపాడేందుకు ఆస్కారముంటుందని జీవీకే ఈఎంఆర్‌ఐ నుంచి వచ్చిన వైద్యులు పేర్కొన్నారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం గజ్వేల్ సీఐ వీరప్రసాద్, ట్రాఫిక్ సీఐ తిరుపతితో పాటు పోలీసు సిబ్బందికి సీపీఆర్ చేసే విధానంపై జీవీకే ఈఎంఆర్‌ఐ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

### బాల్య వివాహం చట్టరీత్యా నేరం

చేర్యాల(సిద్దిపేట): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రతినిధి అనిత అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో వార్డుస్థాయి బాలల పరిరక్షణ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా 4వ వార్డు కమిటీ చైర్మన్‌గా స్థానిక కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కన్వీనర్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లను ఎన్నుకున్నారు. అనంతరం అనిత మాట్లాడుతూ.. బాల్యవివాహం చేస్తే బాల్యవివాహాల నిషేధ చట్టం 2006 ప్రకారం 2 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. బాల బాలికలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 112, 100, 1098కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ.. బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, వారికి ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, వీవో లీడర్, వీవో సభ్యులు, ఏఎల్‌ఎంఎస్‌సీ సభ్యులు, కిశోర బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

### మత సామరస్యానికి ప్రతీక రంజాన్



హుస్నాబాద్: ముస్లింలకు కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: మత సామరస్యానికి రంజాన్ ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. ముస్లింలకు గురువారం రాత్రి పట్టణంలోని కేజేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజాన్ తోఫాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని పండగలకు సమాన ప్రాధాన్యతను కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీలు లకావత్ మానస, కీర్తి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, కో–ఆప్షన్ సభ్యుడు అయూబ్ పాషా, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో సిద్దిపేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ మాసం పురస్కరించుకొని నిరుపేద ముస్లింలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సుడా డైరెక్టర్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో సిద్దిపేట ఫౌండేషన్ సమన్వయకర్త లయిక్, మున్సిపల్ కో–ఆప్షన్ మెంబర్ సయిద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొయిజ్, ఫయాజ్, కంతుల రమేశ్, చందు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

గజ్వేల్‌రూరల్: అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ముస్లింలకు ప్రభుత్వం నుంచి వచ్చిన రంజాన్ తోఫాలను పట్టణంలో వైస్ చైర్మన్ జకియొద్దీన్ ఆయా వార్డుల్లో గురువారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జెడ్పీటీసీ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని ముస్లింలకు గురువారం తహసీల్దార్ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్‌లతో కలిసి రైతుబంధు సమితీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవి రవీందర్ రంజాన్ కానుకలను అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితీ మండల కో–ఆర్డినేటర్ దుర్గయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుమార్, ఎంపీటీసీ భూములుగౌడ్, సర్పంచ్‌లు మహిపాల్, దశరథం, నాయకులు ఐలయ్య, కనకయ్య, రాజు పాల్గొన్నారు.

### ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు

వర్గల్(గజ్వేల్): రంజాన్ పురస్కరించుకొని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి గురువారం వర్గల్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం పవిత్రమైనదన్నారు. అల్లా దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బాలూయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నాగరాజు, మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ ఫారుఖ్‌అలీ, మైనారిటీ నాయకులు వాజిద్‌పాషా పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన దుద్దెడలోని ప్రార్థనా మందిరంలో రంజాన్ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల నాయకుడు గోనె శ్రీనివాస్ ముస్లింలకు గురువారం రాత్రి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లం, ముస్లింలు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలి**

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు మత్తడి వద్ద అనుమతి లేకుండా నిర్మించిన అక్రమ మదర్సా కట్టడాన్ని కూల్చివేయాలని హిందూ వాహిని జిల్లా సహ సంయోజక్ పూదరి వెంకటేశ్ గురువారం మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యకు వినతిపత్రం ఇచ్చాడు. ఒక చిన్న గదిని కట్టి దానిని పెద్దఎత్తున మదర్సాగా మార్చడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

◆ **పరామర్శ**

మిరుదొడ్డి(దుబ్బాక): హైదరాబాద్‌లోని సనత్‌నగర్ ఈఎస్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ బొమ్మ నారాగౌడ్‌ను ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి గురువారం ఆస్పత్రిలో పరామర్శించారు. నారాగౌడ్‌కు మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లను కోరారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ వెంకటయ్య, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడు దుబ్బరాజం పాల్గొన్నారు.

◆ **వజ్రోత్సవాల డోర్ పోస్టర్ ఆవిష్కరణ**

హుస్నాబాద్: మన పెద్ద బడి వజ్రోత్సవ కార్యక్రమాల డోర్ పోస్టర్‌ను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత ఆవిష్కరించారు. వజ్రోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఇంటికి 7000 డోర్ పోస్టర్లను పంపిణీ చేయనున్నట్లు పూర్వ విద్యార్థులు ఒంటెల రత్నాకర్, నరహరి, రాజు, రాజయ్యలు తెలిపారు.ఈ నెల 23 నుంచి మే 1వ తేదీ వరకు వజ్రోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రారంభం రోజు పైలాన్‌ను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించనున్నారని, ముగింపు ఉత్సవాలకు వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావులు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు.

◆ **విద్యార్థులు ఉన్నత స్థానాలను చేరుకోవాలి**

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుతూ ఉన్నత స్థానాలను చేరుకోవాలని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీ ఉమాశశి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ ఉన్నత విద్యా కమిషనరేట్ ఆదేశాల మేరకు తెలంగాణ అకాడమీ స్కిల్స్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో మహింద్రా ప్రైడ్ క్లాస్‌రూమ్ సహకారంతో నాంది ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థినులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నాంది ఫౌండేషన్ ప్రతినిధులు స్వాతి కళాశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థినుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ శర్వాణి, మెంటర్ సందీప్, విద్యార్థినులు పాల్గొన్నారు.

◆ **విశ్వకర్మల అభ్యున్నతికి కృషి చేయాలి**

గజ్వేల్‌రూరల్: విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో పాటు వారి అభ్యున్నతికి కృషి చేయాలని విశ్వకర్మ సంఘం పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటచారి, విఠల్‌చారిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ మండల అధ్యక్షుడిగా నియామకమైన అనంతోజు లక్ష్మినర్సింహచారిని గురువారం సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. విశ్వకర్మలు సరైన ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

◆ **కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలకు స్వాగతం**

గజ్వేల్‌రూరల్: బీజేపీ జాతీయ నాయకుడు, కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద స్థానిక నేతలు ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్‌నుంచి మంచిర్యాల జిల్లా పెద్దపల్లికి వెళ్తున్న క్రమంలో గురువారం సాయంత్రం రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్ చౌరస్తా వద్ద పురుషోత్తం రూపాలకు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్‌గౌడ్, గజ్వేల్ అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా, కోకన్వీనర్‌లు మహేశ్, సురేష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రాములు, పట్టణ అధ్యక్షుడు మధుసూదన్, మండల శాఖ అధ్యక్షుడు అశోక్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్‌యాదవ్‌లతో పాటు బీజేపీ, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.